క్లుప్తంగా

డాక్టర్ గణేష్‌ను కలిసిన ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు



రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన తుమ్మా రవికుమార్‌రెడ్డి, ఝాన్సీలక్ష్మి దంపతులు వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్, కేశవతి దంపతులను ఆదివారం చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధితో పాటు ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని రవికుమార్‌రెడ్డికి సూచించారు.

వరి కుప్ప దగ్ధం



కర్లపాలెం: వరి కుప్ప దగ్ధమైన ఘటన పిట్టలవానిపాలెం మండలంలోని కోమలి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కోమలి గ్రామానికి చెందిన కలకోటి కిషోర్‌రెడ్డికి చెందిన ఎకరంలోని వరి కుప్ప ఆదివారం తెల్లవారుజామున దగ్ధమైనట్లు గుర్తించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చందోలు ఏఎస్ఐ డేవిడ్ తెలిపారు.

నాణ్యమైన పెట్రోలు అందజేయాలి

కర్లపాలెం: వాహనదారులకు నాణ్యమైన పెట్రోలు అందజేయటం ద్వారా వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. కర్లపాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ పెట్రోలియం బంక్‌ను మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయటం వలన వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంక్ మేనేజింగ్ డైరెక్టర్ పేరలి వెంకటసురేష్, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ మాజీ చైర్మన్ దొంతిబోయన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, నాయకులు పరమానందకుమార్, నక్కల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణ



తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దేవస్థానం సత్రం కమిటీ చైర్మన్ నూకల వెంకట వేణుగోపాలరావు పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ములుకుట్ల విశ్వనాథశర్మ పంచాంగ శ్రవణం చేశారు. సత్రం కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, కమిటీ కార్యవర్గ సభ్యులు వుప్పల వరదరాజులు, గొడవర్తి సాయిహరే రామ్, నూకల భాస్కర్, గ్రంధి వెంకట విశ్వేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

మినరల్ పేరిట మోసం

- నాణ్యతా ప్రమాణాలు పాటించని వాటర్ ప్లాంట్ కంపెనీలు
- బోరు నీటినే యథేచ్ఛగా విక్రయిస్తున్న నిర్వాహకులు
- పెరిగిన నీటి ధరలు.. పట్టించుకోని అధికారులు



క్యాన్లు శుద్ధి చేయకుండానే తాగునీటి తరలింపు



వాటర్ ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేసే యంత్రం

బాపట్ల: ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించిన కొందరు వ్యాపారులు మినరల్ వాటర్ పేరిట మహా మోసానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ నాణ్యత ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. కొన్ని ప్లాంట్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. పట్టణ, మండల పరిధిలో కుప్పలు తెప్పలుగా వెలుస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లను అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించడానికి మైక్రో బయాలజీ, కెమికల్ ల్యాబ్ నిర్వహణకు ల్యాబ్ టెక్నీషియన్ అవసరం ఉంటుంది. కానీ ఎక్కడా కూడా ల్యాబ్ టెక్నీషియన్ కనిపించరు. భూమిలోని బోరు నీటిని పంప్ చేసి వాటిని మినరల్ వాటర్ క్యానుల్లో నింపి వాటినే మినరల్ వాటర్‌గా విక్రయిస్తున్నారు.

పెరిగిన నీటి ధరలు

ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండటంతో మున్సిపాల్టీ పరిధిలోని చెరువులు, ఆయా గ్రామాల్లోని తాగునీటి చెరువుల్లో నీళ్లు అడుగంటాయి. దీంతో అధికారులు ఉన్న కొద్దిపాటి నీటినే ప్రజలకు సరఫరా చేస్తున్నారు. నీటిని సరైన పద్ధతిలో క్లోరినేషన్ చేయకపోవడంతో తాగునీరు మురికిగా వస్తున్నాయి. ఈ నీటిని తాగితే రోగాలు వస్తాయని భావించిన ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్ల వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రజల అవసరాలను ఆసరగా తీసుకున్న వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు ఏకంగా 20 లీటర్ల క్యాన్‌ను రూ.10 నుంచి 25కు పెంచేశారు. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలు కొనుగోలు చేయాల్సి వస్తుంది.

పాటించాల్సిన నిబంధనలు ఇవి

- వాటర్ ప్లాంటు ఏర్పాటుకు సంబంధిత పట్టణ, గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తప్పనిసరి.
- పరిశ్రమల శాఖ నుంచి పార్టు–1 అనుమతి పొందాలి.
- భారతీయ ప్రమాణాలు (ఐఎస్ఐ) అనుమతి పొందాలి.
- ప్లాంట్లలో ఏసీతోపాటు మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్స్ ఉండాలి.
- ప్రతి రోజు.. నెలకోరోజు నీటిని వేర్వేరుగా పరీక్షలు నిర్వహించి రికార్డులను అధికారులకు అందజేయాలి. అయితే ఇవేవీ మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పాటించడం లేదు.

చర్యలు తీసుకోవాలి

నీటి నాణ్యతా ప్రమాణాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నీటిని శుద్ధి చేయకుండా యథేచ్ఛగా విక్రయాలు జరిపే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో ఆయా కంపెనీల వారు వారికిష్టమొచ్చిన నీటితో వ్యాపారం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నీటి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాంట్లపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మినరల్ వాటర్ ప్లాంట్లపై తరచూ పరిశీలన చేస్తున్నాం. ఎక్కడైనా నిబంధనలు పాటించకపోతే వాటిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదు.

– జి.రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్

వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళలకు పెద్దపీట



డాక్టర్ ఈవూరు గణేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పొన్నపల్లి గ్రామ మహిళలు

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలోనే మహిళలకు పెద్దపీట వేయటం జరిగిందని, మహిళలకు ఇచ్చిన ప్రాముఖ్యతను కూటమి ప్రభుత్వం విస్మరించిందనటంలో ఎటువంటి సందేహం లేదని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ స్పష్టం చేశారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో పొన్నపల్లి గ్రామానికి చెందిన 100 మంది మహిళలు డాక్టర్ గణేష్‌ను ఆదివారం సాయంత్రం కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ జగనన్న కొడుకుగా, అన్నగా, తమ్ముడిగా ఆడపడుచులకు చేదోడు వాదోడుగా ఉన్నారన్నారు. ప్రతి కార్యక్రమంలోనూ మహిళలకు అగ్రస్థానం కల్పించి ఆర్థిక భరోసాను కల్పించారన్నారు. మహిళా సాధికారతతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని భావించిన జగనన్న మహిళలను అనేక విధాలుగా ఆదుకున్నారన్నారు. స్థానిక సంస్థల్లో సైతం 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం మహిళలను వంచన చేసిందనటంలో ఎటువంటి సందేహం లేదన్నారు. మహిళాభివృద్ధికి పాటుపడిన జగనన్నకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుండి వెంకట రామిరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు నూతన ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం

రేపల్లె రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ రేపల్లె డిపోకు నూతనంగా వచ్చిన 10 ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఈ నెల 31వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదగా ప్రారంభించబడునని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సునీల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఏపీ రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, ఆర్టీసీ ఉన్నతాధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.



రేపల్లెలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తులు



అమ్మవారికి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



విశ్వావసు నామ సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు

పలు ఆలయాల్లో ఉగాది పర్వదిన పూజలు

రేపల్లె రూరల్: చైత్ర శుద్ధ పాడ్యమి సందర్భంగా ఉగాది పర్వదినం పురస్కరించుకుని నియోజకవర్గంలో విశ్వావసు నామ సంవత్సర పర్వదిన్నాని ఆదివారం ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రేపల్లె పట్టణ గ్రామ దేవత బూరుగులమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు 108 బంగారు పుష్పాలతో విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఓల్డ్‌టౌన్‌లోని కన్యాకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, పెదకూరగాయల మార్కెట్ సమీపంలోని విఘ్నేశ్వరుని ఆలయం, ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయం, ఉప్పూడి రోడ్డులోని గోదా రాజ్యలక్ష్మి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఉగాది పర్వదిన వేడులను నిర్వహించి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

విశ్వావసు నామ సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

రేపల్లె రూరల్: తీపి, చేదు, కష్ట, సుఖాల మేళవింపే జీవిత పరమార్థమని, దానిని తెలియజేసే పండుగే ఉగాది అని దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య కార్యదర్శి పీఎస్‌బీ శర్మ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన విశ్వావసు నామ సంవత్సర నూతన క్యాలెండర్‌ను సమాఖ్య సభ్యులతో కలిసి ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఆరు రుచులు కలగలసిన ఉగాది పచ్చడి మనిషి జీవితంలో జరిగే సంఘటనల అంతర్యాన్ని తెలుపుతుందన్నారు. తొలుత రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పండితులు అప్పాజోస్యుల దక్షిణామూర్తి పంచాంగ శ్రవణం చేశారు. దక్షిణామూర్తి, హనుమత్‌శాస్త్రి, దీవి రంగనాథాచార్యులకు పూలమాలలు, శాలువాలతో సత్కారం చేశారు. కార్యక్రమంలో సమాఖ్య కోశాధికారి విజయసారథి, గౌరవాధ్యక్షుడు సీవీ మోహనరావు, సభ్యులు కొండవీటి అగస్త్యశాస్త్రి, దివి హరికుమార్, సుదర్శనభట్టాచార్యులు, రొంపిచర్ల శ్రీనివాస్, నల్లూరి లక్ష్మీనారాయణ భట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



బూరుగులమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వైభవంగా ఉగాది పర్వదిన పూజలు

రేపల్లె రూరల్: ఉగాదిని పురస్కరించుకుని పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో కల్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో నల్లూరి కల్యాణ్ చక్రవర్తిచే ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని తొలుత ప్రత్యేక వాహనంలో నెలకొల్పి పురవీధుల్లో ఊరేగింపు చేశారు. అనంతరం కల్యాణ మండపంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సూర్య, లక్ష్మీ, అష్టోత్తరాలు, లలితా సహస్రనామం, మణిద్వీప వర్ణన పారాయణం చేశారు. అనంతరం చక్రవర్తి పంచాంగ శ్రవణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్యాణ మండపం కమిటీ సభ్యులు మద్ది బదరీ నారాయణమూర్తి, మద్ది పద్మజ, నాగలీల, నంబూరు సత్యప్రసాద్, యెండూరి రామచంద్రరావు, యెండూరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని గుత్తికొండ లక్ష్మీనారాయణ కల్యాణ మండపంలో మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పర్వదిన వేడుకలను నిర్వహించారు.

చుండూరు మండలంలో...

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 7 గంటల నుంచి భక్తులు స్వామి వారికి అభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు విశ్వావసు నామ ఉగాది పంచాంగ శ్రవణాన్ని అర్చకులు మామిళ్లపల్లి సత్యనారాయణ శర్మ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదలు స్వీకరించారు.

పంచాంగ శ్రవణానికి విశేష స్పందన



పంచాంగ పఠనం చేస్తున్న అప్పాజోస్యుల దక్షిణామూర్తి శర్మ

కొల్లూరు : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం మండలంలోని పలు ఆలయాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా కొల్లూరు అనంతభోగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విశ్వావసు నామ సంవత్సరం ప్రతి ఒక్కరికి మంచిని చేకూర్చాలని ఈ సందర్భంగా పంచాంగ పఠన కర్త అప్పాజోస్యుల దక్షిణామూర్తి శర్మ ఆకాంక్షించారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: సత్యసాయి సేవా సమితిలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సత్యసాయి చిత్రపటాలకు, షిరిడీ సాయి విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు పాల్గొని ఉగాది పండుగ విశిష్టతను తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు, ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.



చినపరిమిలో పంచాంగ పఠనం చేస్తున్న సత్యనారాయణ శర్మ



సాయిబాబా ఆలయంలో కవి సమ్మేళనం

ఉగాది పురస్కారం అందుకున్న శ్రీనివాసమూర్తి



వేమూరు: జంపని చెన్నకేశవస్వామి దేవస్థానం అర్చకులుగా పని చేస్తున్న మేడూరి శ్రీనివాసమూర్తి ఉగాది పురస్కారం అందుకున్నారు. బాపట్ల జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టరు వెంకట మురళి పురస్కారం ఆదివారం అందజేశారు. దేవదాయ శాఖ ద్వారా నగదు, బహుమతి, మెమెంటో ప్రశంసాపత్రం దుశ్శాలువాలతో కలెక్టరు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సురేష్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నాటుసారాతో జీవితాలు నాశనం

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ రాజశ్రీ



రేపల్లె రూరల్: నాటుసారా తాగి జీవితాలను నాశనం చేసుకోరాదని రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ రాజశ్రీ సూచించారు. నాటుసారాతో కలిగే దుష్ప్రభావాలను తెలుపుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రచార రథంను నగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలోని గుడ్డికాయలంక గ్రామంలో ఆదివారం ఆమె ప్రారంభించి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారా తాగటంతో తమ జీవితాన్ని నాశనం చేసుకోవటమే కాకుండా కుటుంబం సైతం ఛిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు నెలకొంటాయన్నారు. శరీరంలోని ప్రతి అవయవం దెబ్బతింటుందని, నాటుసారా మాని వేయటంతో పాటు తాగే ప్రతి ఒక్కరూ మాని వేసే విధంగా చైతన్య పరచాలని కోరారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఈ ప్రక్రియలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్‌కు సర్వం సిద్ధం

ముస్తాబయిన మసీదులు, ఈద్గాలు

రేపల్లె రూరల్: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణం, మండలంలో వేడుకలు నిర్వహించుకునేందుకు ముస్లిం సోదరులు సర్వం సిద్ధం చేశారు. గత నెల రోజులుగా ముస్లింలు చేస్తున్న ఉపవాస దీక్షలు నేటితో తీరనున్నాయి. పట్టణంలోని వివిధ మసీదులను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పెనుమూడి రోడ్డు తూర్పు జామియా మసీదు, పెద్ద పోస్టాఫీసు రోడ్డులోని పెద జామియా మసీదు, రామకోటిపేట మదీన మసీదు, లక్ష్మీ టాకీసు సెంటరులోని మర్కస్ మసీదు, జేఎల్‌బీ కళాశాల రోడ్డులోని అబూబకర్ మసీదు, నేతాజీనగర్‌లలోని నసీరుద్దీన్ మసీదులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సోమవారం ముస్లిం సోదరులు నమాజు నిర్వహించుకునేందుకు ఉయ్యూరువారిపాలెం రహదారిలోని ఈద్గాను సిద్ధం చేశారు.

వేమూరు: రంజాన్‌కు మసీదులను విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో రంజాన్ పండగకు మసీదులను సుందరంగా అలంకరించారు. సోమవారం రంజాన్ పండుగ నిర్వహించడం జరుగుతుంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అన్ని గ్రామాల మసీదులను అందంగా ముస్తాబు చేశారు.

కొల్లూరు : రంజాన్ పండుగను పురస్కరించుకొని విద్యుత్ దీపాల వెలుగులతో మసీదులు పండుగ శోభను సంతరించుకుంది. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా ఆదివారం సాయంత్రం నెల రోజుల నుంచి ఉపవాసాలున్న ముస్లింలు ఉపవాసాలను విరమించారు. పండుగ సందర్భంగా కొల్లూరులోని మసీదును విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. సోమవారం పండుగ సందర్భంగా కొల్లూరు సమీపంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు.



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో విద్యుత్ దీపాలతో పెదజామియా మసీదు



విద్యుత్ దీపాలతో కొల్లూరు మసీదు



విద్యుత్ దీపాలతో జంపని మసీదు

తెలుగు భాషపై చిన్నారులకు పరీక్ష

తెనాలి: ఉగాది పర్వదినం సందర్భంగా మదుపల్లి వెంకటేశ్వర్లు–రంగనాయకమ్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం తెలుగు భాషపై పరీక్ష నిర్వహించారు. స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 5, 6 తరగతులకు చెందిన 50 మంది బాలబాలికలు హాజరయ్యారు. తొలి ముగ్గురు విజేతలకు రూ.3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి బహూకరించారు. మరో పదిమందికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మదుపల్లి శ్రీనివాస్–పద్మజ బహుమతులను అందజేయగా, అతిథులుగా రవీంద్ర, కళ్యాణి దంపతులు, ఆర్ఎస్ఎస్ లక్ష్మీనారాయణ, లలితా గ్రూప్ సభ్యులు హాజరయ్యారు.

నేడు తెనాలిలో శాంతి ర్యాలీ

తెనాలి అర్బన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా తెనాలి పరిధిలోని వివిధ పాస్టర్‌ల అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగనుంది.